

పవన్ ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 12న అమరావతిలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో పాటు పార్టీ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో గల ఆయన ఛాంబరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకులం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలను సంప్రదించి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బయలుదేరాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8374104701 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



సరుబుజ్జిలి మండలం శ్యామలాపురంలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

వంశ'ధార' పారేనా..?

- కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ఐదేళ్లుగా పైసా ఇవ్వని ప్రభుత్వం
- ఏటా జిల్లా నిల్వల నుంచే కేటాయింపు
- నిధుల విడుదల కోసం ఎదురుచూస్తున్న అధికారులు

వంశధార రైతులకు ఈ ఏడాదీ సాగునీటి సమస్యలు పునరావృతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కుడి, ఎడమ రెండు కాలువల్లోనూ విపరీతంగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. ఖరీఫ్ సీజన్ మొదలైనా నేటికీ పనులు చేపట్టలేదు. దీంతో శివారు భూములకు సాగునీరు అందడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. గుర్రపుడెక్క, పూడికతీత పనులకు ప్రభుత్వం ఐదేళ్లుగా ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న నిధులతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాదీ ఈ పనులను ఆలస్యంగా మొదలుపెట్టడం, వర్షాలు పడడంతో ఆపేస్తుండడంతో పూర్తిస్థాయిలో పనులు చేయడం సాధ్యపడడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం మూడు నెలలుగా ఎన్నికల నిర్వహణలో తలమునకలై ఉండడంతో సాగునీరు, వ్యవసాయం వంటి అంశాలపై పెద్దగా దృష్టిసారించలేకపోయారు. ఇప్పటికైనా ఈ రంగాలపై సమీక్షలు నిర్వహించి అవసరమైన నిధులు విడుదల చేస్తే రైతులకు కొంతమేరకైనా మేలు చేకూరుతుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1600 క్యూసెక్కులకు మించి నీరు విడిచి పెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.

సొంత ఖర్చులతో గుర్రపుడెక్క తొలగింపు

పంట కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత ఎక్కువ పేరుకుపోతుండడంతో పొలాలకు నీటి ఇబ్బందులు పునరావృతమవుతూనే ఉంది. పనులు ఆలస్యంగా మొదలు పెడుతుండడం, సరిపోయినంత నిధులు విడుదల చేయకపోవడంతో కొన్నిచోట్ల రైతులే తమ సొంత డబ్బులతో కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించుకున్నారు. గతేడాది జూలై 29న పోలాకి గ్రామానికి చెందిన పది మంది రైతులు గుర్రపుడెక్క, పూడిక తొలగించాలని వంశధార కాలువలో దిగారు. కాలువల్లో నీరు ప్రవహించడంతో ముప్పిడి శాంతారావు అనే రైతు గల్లంతయ్యాడు.

ప్రతిపాదనలు ఇలా...

వంశధారలో కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత పనులకు రూ.95 లక్షలు అవసరమని వంశధార అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాదీ నిధులు విడుదలవుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పనులు చేపట్టాలంటే జిల్లా ఉన్నతాధికారులే నిధుల విడుదలకు చొరవ చూపాల్సి ఉంది.

గుర్రపుడెక్క తొలగింపుపై కార్యాచరణ



గుర్రపుడెక్క, పూడిక తొలగింపునకు అవసరమైన కార్యాచరణ ప్రారంభించాం. ప్రభుత్వానికి రూ.95 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధుల విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఈ ఏడాది రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. శివారు భూములకు నీరందేలా చర్యలు తీసుకుంటాం.

- డోల తిరుమలరావు,
వంశధార సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు

జిల్లా నిధుల నుంచే గుర్రపుడెక్క తొలగింపు పనులు

కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు సాఫీగా ప్రవహించని పరిస్థితి ఏటా తలెత్తుతోంది. ప్రభుత్వానికి నిధులు అడుగుతున్నా విడుదల చేయకపోవడంతో, జిల్లా అధికారులు పలురకాల ఫండ్స్ నుంచి అత్యవసరంగా నిధులు మంజూరు చేస్తున్నారు. గుర్రపుడెక్క తొలగింపునకు గతేడాది జూలైలో రూ.50 లక్షలు ఇచ్చారు. 2022 జూలైలో రూ.44 లక్షలు, ఆగస్టులో రూ.19.5 లక్షలు కేటాయించారు. 2021లో రూ.15 లక్షలు విడుదల చేశారు. ఈ ఏడాదీ నిధులు కేటాయించి పనులు వేగంగా పూర్తి చేస్తే ఖరీఫ్‌కు రైతుల కష్టాలు తీరనున్నాయి.

రామ్మోహన్‌కు పౌర విమానయానం

- జిల్లా అభివృద్ధికి ఏవిధంగా దోహదపడని శాఖ కేటాయింపు
- వెనుకబడిన ప్రాంతంపై బిజెపి చిన్నచూపు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి పదవి దక్కడంతో టిడిపి శ్రేణులతో పాటు జిల్లా ప్రజానీకమూ ఎంతో సంబరపడ్డారు. కేంద్ర ప్రభుత్వంలో కేబినెట్ హోదా దక్కడంతో ఏదైనా ప్రాధాన్యమున్న మంత్రిత్వశాఖ కేటాయిస్తారని అంతా ఆశగా ఎదురుచూశారు. వారి ఆశలను అడియాశలను చేస్తూ మోడీ ప్రభుత్వం పౌర విమానయాన శాఖను కట్టబెట్టింది. సంపన్నులకే పరిమితమైన విమానయాన శాఖ ఇవ్వడంపై పెదవి విరుస్తున్నారు. విమానయానశాఖ ద్వారా పెద్దగా నిధులు వచ్చే పరిస్థితే లేనప్పుడు జిల్లాకు, రాష్ట్రానికి ఏం ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు. తొలి నుంచీ ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న బిజెపి, ప్రస్తుతం అదే ఒరవడి కొనసాగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి ఏడాదికి రూ.ఐదు కోట్లు చొప్పున ఇవ్వాల్సిన బిజెపి ప్రభుత్వం, ఆ నిధులను 2018 నుంచి నిలిపిసేంది. పదేళ్ల పూర్తయినా విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయకుండా మోసం చేసింది.

ఉత్తరాంధ్ర ప్రాంతమంటే అంత చులకనా?

ఉత్తరాంధ్ర ప్రాంతమంటే బిజెపికి తొలి నుంచీ చులకనభావం ప్రదర్శిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఎన్‌డిఎ మొదటి పర్యాయం పాలనలో విజయనగరం ఎంపీ పూసపాటి అశోక్ గజపతిరాజుకు పౌర విమానయన శాఖ మంత్రిత్వశాఖ కేటాయించింది. ఇప్పుడు ఎన్‌డిఎ మూడో పర్యాయం పాలనలోనూ అదే శాఖను ఎంపీ రామ్మోహన్‌నాయుడుకి కేటాయించింది. నరసాపురం నుంచి బిజెపి తరుపున ఎన్నికైన ఎంపీ శ్రీనివాసవర్మకు సహాయ మంత్రిగా భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ కేటాయించింది. ఆ శాఖ కేటాయించినా వెనుకబడిన ప్రాంతమైన జిల్లాలో ఒకట్రెండు భారీ పరిశ్రమలైనా ఏర్పాటు చేసుకునే అవకాశం దక్కేది.

నాటి యునైటెడ్ ఫ్రంటే నయం

ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం కంటే నాటి యునైటెడ్ ఫ్రంటే నయంగా కనిపిస్తోంది. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో చేరిన టిడిపికి ప్రాధాన్యం దక్కింది. నేడు అదీ లేదు. నాడు ఎంపీగా గెలిచిన కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడుకి కీలకమైన కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖ కేటాయించింది. ప్రస్తుత ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వంలో బిజెపి తర్వాత రెండో అతి పెద్దగా పార్టీగా టిడిపి ఉన్నా, ప్రభుత్వ శాఖల కేటాయింపులో ఆ మేరకు ప్రాధాన్యం లేకపోవడంపై ఆ పార్టీ నాయకుల నుంచే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా అందరికీ నాణ్యమైన విద్య అందుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ అన్నారు. నగరంలోని తిలక్ నగర్‌లో గల యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం కోసం ఉపాధ్యాయులే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. నూతన ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం మెగా డిఎస్‌సిని తక్షణమే ప్రకటించాలని, విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జిఒ నంబర్ 117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కాపాడాలని కోరారు. గతేడాది 4,600 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటరు లోపు ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని గుర్తుచేశారు. మూసేసిన ఆ ప్రాథమిక పాఠశాలలను పునరుద్ధరించాలని కోరారు. వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకుని మెగా డిఎస్‌సిని వెంటనే ప్రకటించి, ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరంతరం చర్చలకు పిలవడం, ప్రజాస్వామ్య పద్ధతిగా వ్యవహరించడం వల్ల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వీలుంటుందన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, నైతిక విలువలు పెంపుదల ఉంటాయన్న నమ్మకాన్ని తల్లిదండ్రులు, సమాజంలో కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, జి.గిరిధర్, జిల్లా కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాష్, ఎం.వి రమణ, పి.మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ఎమ్మెల్సీ పి.రఘువర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న పిఆర్‌సి కోసం వెంటనే కసరత్తు ప్రారంభించాలన్నారు. ఈలోగా మధ్యంతర భృతిపి ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి పాత విధానంలోనే కొనసాగించాలని సూచించారు. ఇందుకు సంబంధించి జిఒ నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ సిబిఎస్‌ఇ సిలబస్‌ను సిబిఎస్‌సి పాఠశాలలకు పరిమితం చేసి, మిగిలిన అన్ని పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ను ప్రవేశపెట్టాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దన్నారు. నూతన ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే మెగా డిఎస్‌సి ప్రకటించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

హడావుడిగా 'నాడు-నేడు' పనులు

హెచ్‌ఎంపై ఎంఇఒ ఫిర్యాదు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హడావుడిగా నాడు-నేడు పనులు చేపడుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరనుండడంతో నాడు-నేడు పనులు నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ పాఠశాలలో గతంలో పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో బిల్లులు చెల్లించారన్న ఆరోపణలున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు రెండు రోజులుగా చేపట్టని పనులను పూర్తి చేసేందుకు పనులు చేపడుతున్నారు.

ఈ సమాచారం తెలుసుకున్న ఎంఇఒ-2 పట్నాన రాజారావు పనులు నిలిపివేయాలని ఆదేశించినా, పాఠశాలలో రోడ్డు పనులు, భవనానికి సున్నం వేయడం వంటి పనులు చేస్తున్నారు. సోమవారం కూడా పనులు కొనసాగడంతో దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంఇఒ-2 రాజావరావు తెలిపారు.



పాఠశాల భవనానికి వేస్తున్న సున్నం



పాఠశాలలో చేపడుతున్న రోడ్డు పనులు

కాంట్రాక్టు ఎఎన్‌ఎంల సర్వీసు పొడిగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గిరిజన ప్రాంత మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు ఎఎన్‌ఎంలుగా పనిచేస్తున్న 18 మంది సర్వీస్‌ను మరో ఏడాది పాటు పెంచుతూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంట్రాక్టు ఎఎన్‌ఎంలకు నాలుగు నెలలుగా జీతాల చెల్లింపు నిలుపుదల చేశారు. ఈ ఉత్తర్వులను అనుసరించి తిరిగి వేతనాలు పొందడానికి వీలు కలిగింది. ఎల్‌ఎన్‌పేట, నందిగాం, మర్రిపాడు పిహెచ్‌సిల్లో నలుగురికి... బైదలాపురం, మందస, సిరిపురం, కరజాడ, హిరమండలం, చొర్లంగి, ఎం.ఎస్ పల్లి, కంచిలి, గుత్తావల్లి, మెళియాపుట్టి, కుశిమి, భామిని పిహెచ్‌సిల్లో ఒక్కొక్కరికి మరో ఏడాది కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చారు.

నిమ్మాడ ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

కోటబొమ్మాళి : మండలంలోని నిమ్మాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను సిహెచ్‌ఒ డాక్టర్ నితీష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు, ఒపిని పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు ఎల్లవేళలా వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒ స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

సమాజ హితమే 'స్వీప్' లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

సమాజ హితమే స్వీప్ స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకులు కొమ్ము రమణమూర్తి అన్నారు. స్వీప్ సంస్థ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తండ్యాంవలసలో మొక్కలు నాటడం, ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేయడంలో, బాలల హక్కులపై ఉత్తరాంధ్రలో రైట్ టు ఎడ్యుకేషన్ ఫర్ కన్వీనర్‌గా దేశ, రాష్ట్రస్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల హక్కులు, విపత్తుల నుంచి ఎదుర్కోవడంపై అవగాహనను కలిగించినట్లు చెప్పారు. మైదాన ప్రాంతంలో మహిళా సంఘాలు, రైతులు, నాన్ పోస్ట్ సైడ్ మేనేజ్‌మెంట్‌తో మొదలుపెట్టి ప్రకృతి వ్యవసాయం వరకు చిరుధాన్యాల పంటలను ప్రోత్సహిస్తూ ఫార్మర్ ప్రొడక్ట్ కంపెనీలు నడపడంలో మెళకువలు నేర్పామని వివరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాథనాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై స్వీప్ స్వచ్ఛంద సంస్థ సాగించిన కృషి అభినందనీయమన్నారు. మూడేళ్ల పాటు జిల్లాలో సేంద్రీయ సేద్య తొలి జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా డిఆర్‌డిఎ ద్వారా సేవలందించిన జగన్నాథ నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో సేంద్రీయ సేద్య ప్రచారకులు డి.అన్నపూర్ణ, సంస్థ కో- ఆర్డినేటర్ అప్పన్న, ప్రజలు పాల్గొన్నారు.

అరసవల్లి హుండీ ఆదాయం రూ.73.06 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీని ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో సోమవారం లెక్కించారు. ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యాన దేవాదాయశాఖకు చెందిన ముగ్గురు ఇఒలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. వైశాఖ మాసం సందర్భంగా ఆలయానికి యాత్రికుల రద్దీ అధికంగా ఉండడం వల్ల సుమారు 300 మందితో లెక్కింపు చేశారు. గత నెల రెండో తేదీ నుంచి ఈనెల పదో తేదీ వరకు హుండీ ఆదాయం రూ.73.06 లక్షలు లభించింది. నోట్ల రూపంలో రూ.70,38,653, చిల్లర నాణేల రూపంలో రూ.2,67,120 మొత్తం రూ.73,05,873 ఆదాయం లభించిందని ఆలయ ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. నగదుతో పాటు 26 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 200 గ్రాముల వెండి, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా డాలర్లు 3, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ శ్రీలంక రూ.50, బ్యాంకు నెగర మలేషియా 1 రింగ్గిట్ వచ్చాయని తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో విజయనగరం జిల్లా రామతీర్థాలు ఇఒ శ్రీనివాసరావు, శ్రీకూర్మం ఇఒ జి.గురునాథం, అరసవిల్లి అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు



చెక్కును అందజేస్తున్న 'అరబిందో' ఫౌండేషన్ ప్రతినిధులు

అరబిందో ఫార్మా ఔదార్యం

ప్రజాశక్తి- రణస్థలం

అవసరంలో ఉన్నవారిని అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ఆదుకున్నారు. మండలంలోని పైడిభీమవరం పంచాయతీకి చెందిన కోనేటి జస్వంత్ రోడ్డు ప్రమాదంలో మెదడుకు గాయమైంది. పెద్ద ఆపరేషన్‌కు వైద్యులు రూ.లక్ష ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే లోడగల రాధ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వెన్నెముకలు విరిగిపోయాయి. దీంతో ఈమె జీవనోపాధి కోల్పోయింది. ఇద్దరు బాధితులూ ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ స్పందించి ఆర్థికసాయం అందజేశారు. మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి, శరత్ చంద్రారెడ్డి జస్వంత్‌కు రూ.2 లక్షలు, రాధకు రూ.లక్ష చెక్కును అందజేశారు.



ఎంపికైన రగ్బీ జట్టు

జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభని కనబరిచి జిల్లా ఖ్యాతిని ఇనుముడింపజేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డొంకన రామకృష్ణలు అన్నారు. గుంటూరు జిల్లా బాపట్లలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక సోమవారం చేపట్టారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టిన ఈ ఎంపికలో భాగంగా బాలురు, బాలికల జట్లు వేర్వేరుగా ఎంపిక చేశారు. అనంతరం ఎంపికైన జట్టుని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు, ఎన్.జనార్ధన, కె.కె.రఘురామిరెడ్డి, కాపుల రఘునాథరావు, సీతయ్య, నర్మద పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు సన్మానం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం కోటపాడుకు చెందిన ఆదర్శ రైతు కోత మధుసూదనరావుకి అస్సాం రాష్ట్రంలో సోమవారం సన్మానించారు. అస్సాంలోని గెరువా ఐసిఆర్ ఆర్ఆర్ఎఐ ఆర్ఆర్ఎల్ బియ్యం పరిశోధన కేంద్రంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కాంచన్ సైకియా అస్సాం సంప్రదాయ పద్ధతిలో కండువా కప్పి సన్మానించారు. ఆ తరువాత పరిశోధన కేంద్రంలోని సిఆర్ 802 బియ్యం మధుసూదనరావుకు అందించారు.



బియ్యం అందుకున్న మధుసూదనరావు

శాస్త్రీయ విద్య అవసరం

పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు శాస్త్రీయ విద్యపై దృష్టి కేంద్రీకరించాలని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. మున్సిపాలిటీలోని చింతాడ పరిధిలో ఉన్న జి ఎల్ ఫంక్షన్ హాల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు సోమవారం మూడో రోజు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడేది ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమేనని పేర్కొన్నారు. గడచిన కొన్ని దశాబ్దాల కాలంగా విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది ఎస్‌ఎఫ్‌ఐ అని అన్నారు. అనంతరం మతం పుట్టుక పరిణామం అనే అంశంపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. సమాజం ఏ విధంగా మారిపోతుందో మతానికి సంబంధించిన భావాలు, సంప్రదాయాలు, ఆరాధనా పద్ధతులన్నీ మారిపోతున్నాయని అన్నారు. ఒక్క భారతదేశంలోనే 600కు పైగా మతాలు ఉన్నాయన్నారు. మత విశ్వాసం వ్యక్తిగతమని, ఒక మతాన్ని పాటించవచ్చు కానీ, పాటించవద్దని కానీ ఎవరిని ఎవరు బలవంతం చేయలేరని అన్నారు. దానినే మత స్వేచ్ఛ అంటారని పేర్కొన్నారు.

రాజ్యాంగం పౌరులకు మత స్వేచ్ఛను గ్యారెంటీ చేసిందని, దానిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఆ బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలంటే ప్రభుత్వం లౌకికవాదాన్ని కచ్చితంగా పాటించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరీష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిత్యం ప్రభుత్వాలతో పోరాడుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నది ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమేనని అన్నారు. విద్యార్థులకు అనుకూలంగా చట్టాలను రూపొందించాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాలకు హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేశామని గుర్తు చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంచుకునేవిధంగా ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, యు.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శర్మ

రామ్మోహన్ నాయుడుకు అభినందనలు



పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న పురుషోత్తంనాయుడు, రామకృష్ణ

ప్రజాశక్తి- రణస్థలం

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కింజరాపు రామ్మోహన్ నాయుడును, విజయనగరం ఎంపీ కలిశెట్టికి అప్పలనాయుడుని రణస్థలం మండలానికి చెందిన మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, నాయకులు దెయ్యం శ్రీనివాసరావు, దెయ్యం ఉదయ్ కుమార్ సోమవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం ఈ రెండు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కేంద్రం నిధులతో అభివృద్ధి చేసి అన్ని విధాలుగా ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే మరిన్ని పరిశ్రమలూ వస్తాయని తెలిపారు.

బూర్జ : ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న నేపథ్యంలో మండల జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ స్వయంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మధుస్వభావి, నిరంతర కృషివలుడు, మూడు భాషలలో అనర్గళంగా మాట్లాడగలగే యువ కిషోరం రామ్మోహన్ నాయుడు అని అన్నారు. ఆయనతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

సోంపేట: రామ్మోహన్ నాయుడుకి కేంద్ర కేబినేట్‌లో చోటు కల్పించడం హర్షణీయమని టిడిపి నాయకులు కోదండ కృష్ణ అన్నారు. విశాఖకు రైల్వే జోన్, విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వరకు వెళ్లే రైళ్ల బారువలో హాల్ట్ కల్పించడం, భావనపాడు, బారువ పోర్టు నిర్మాణాలు, ఇచ్చాపురంలో కొబ్బరి పీచు పరిశ్రమ, పార్కులు స్థాపించడం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కోస్టల్ కారిడార్ నెల్లూరు నుంచి ఇచ్ఛాపురం వరకు తీసుకురావడం ఇప్పుడు అవసరమని అన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరావులూ మర్యాదపూర్వకంగా కలిశారు.

పొందూరు :జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ లోలుగు వెంకట్ ఢిల్లీలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

అజ్ఞాతంలో వైసిపి నాయకులు!

ప్రజాశక్తి- టెక్కలి

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడు వరుసగా మూడోసారి విజయం సాధించా రు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ టిడిపి అధికారంలోకి వచ్చింది. ఈ తరుణంలో టెక్కలి నియోజకవర్గంలోని వైసిపి ద్వితీయ శ్రేణి నాయకుల్లో, ముఖ్య కార్యకర్తల్లో టెన్షన్ పడుతున్నట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లలో నియోజకవర్గం పరిధిలోని పలువురు టిడిపి నాయకులపై కేసులు నమోదయ్యాయి. దీనిపై అచ్చెన్నాయుడు ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టిడిపి అధికారం చేపట్టిన తరువాత వైసిపి వ్యవహారశైలిపై అచ్చెన్నాయుడు మండిపడే ఘటనలు కనిపిస్తుండడంతో ఆందోళన ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైసిపి అధికారం లో ఉన్న సమయంలో అచ్చెన్నాయుడుపై నోరుపారేసుకున్న ఘటనలు ఉన్నారు. ఈ క్రమంలో దువ్వాడ వ్యవహరించిన శైలి, ఇందుకు ఆజ్యం పోసే విధంగా కొందరు ద్వితీయశ్రేణి నాయకులు వ్యవహరించిన తీరు, సోషల్ మీడియాను వేదికగా వ్యవహార శైలిపై టిడిపి నాయకులు ఆగ్రహంగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది. దువ్వాడ శ్రీనివాస్ అధికారం హోదాలో ఉన్న సమయం లోనే ఆదుకోలేదని, అండగా నిలబడలేకపోయారని, అటువంటిది ఇప్పుడు తమపై ఏ విధంగా అండగా ఉంటారని వైసిపి కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వైసిపి నాయకులు టెక్కలి పట్టణాన్ని విడిచి దూరంగా ఉన్నారనే వాదన బలంగా వినిపిస్తుంది. వీటితో పాటు స్థానిక పట్టుమహదేవి కోనేరు గట్టుపై నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణంలో చోటుచేసుకున్న పరిణామాలు, నిధులు వెచ్చించడంలో జరిగిన పొరపాట్లపైనా వైసిపి నాయకులు తప్పిదాలకు పాల్పడిన ఘటనలపై టెక్కలిలో ఒక గ్రూపునకు చెందిన వారు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ఈ వ్యవహారంపై కూడా అచ్చెన్నాయుడు స్పందించే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వైసిపి నేతల వెన్నులో వణుకు పుడుతున్నట్లు సమాచారం.

గురుప్రసాద్‌కు పతకాలు

ప్రజాశక్తి- సోంపేట

విశాఖపట్నంలో రెండు రోజులుగా రెండో స్టేట్ డెడ్ లిఫ్ట్ ఛాంపియన్ షిప్, 4వ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్, 6వ రాష్ట్ర బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని కొర్లాంకు చెందిన పెద్దింటి గురుప్రసాద్ పాల్గొన్నారు. సీనియర్ కేటగిరీలో రాష్ట్ర పవర్ లిఫ్ట్ ఛాంపియన్ షిప్‌లో రజతం, రాష్ట్ర బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్‌లో కాంస్యం, రాష్ట్ర డెడ్ లిఫ్ట్ ఛాంపియన్ షిప్‌లో కాంస్యం బహుమతులు గెలుచుకున్నారు. దీంతో క్రీడాకారులు గురుప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.



పతకాలతో గురుప్రసాద్


చంద్రబాబును కలిసిన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ఎమ్మెల్యే కూన రవి కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలో ఏర్పడబోయే నూతన మంత్రివర్గంలో రవికుమార్‌కు సముచిత స్థానం లభిస్తుందని ఇప్పటికే పలువురు చర్చించుకుంటూ ఉండటంతో ఆయన కలవడం చర్చనీయాంశంగా మారింది.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్



పిల్లలు తయారు చేసిన అందమైన వస్తువులు

ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నాలుగు రోజులపాటు తుమ్మావీధిలోని మెహర్ ఎలిమెంటరీ స్కూల్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణలో పిల్లల వైద్యులు డాక్టర్ బగాది శ్రావ్య పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై సూచనలు అందించారు. సమతులాహారం, మంచి జీవనశైలితో వ్యాధులను నివారించవచ్చన్నారు. అనంతరం ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను వి.జి.కె.మూర్తి, ఎం.ప్రభాకర రావు, చింతా కృష్ణారావు, సూర్యనారాయణలు అందజేశారు. కార్యక్రమంలో తుమ్మావీధి కమిటీ సభ్యులు రంగ ప్రసాదరావు, కంకాలమ్మ శ్రీనివాసరావు, సరోజని, రమణమూర్తి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న వెంకటరమణ

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఆయకట్టు రైతులను నూతన ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఓనిగెడ్డ ఆయకట్టు సుమారు 8,500 ఎకరాలు, మరియు నాగావళి నదిపై ఉన్న ఓపెన్ హెడ్‌ఛానల్ ఆయుకట్టు 8,000 ఎకరాలకు తగినంత నీరు లేదని అన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు శాశ్విత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

అమరావతికి నాలుగు బస్సులు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా పలాస నుంచి అమరావతికు వెళ్లేందుకు నాలుగు బస్సులు వేస్తున్నట్లు ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం హరిపురం, పలాస జూనియర్ కళాశాల, అక్కుపల్లి, టిడిపి నూతన కార్యాలయం నుంచి బస్సులు బయలుదేరిన్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఆర్‌డిసి డిపో మేనేజర్, టిడిపి కార్యాలయాలను సంప్రదించాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న రవి

దరఖాస్తులకు ఆహ్వానం

సోంపేట: విజయనగరం జిల్లాలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొందూరు రవి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యాన ప్రత్యేక బృందం కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, మందస, పలాస తదితర మండలాల్లో సోమవారం పర్యటించి అవగాహన కలిగించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సన్యాసిరావు

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి- బూర్జ

సమాజ శ్రేయస్సే పరామవధిగా ఈనాడు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు కృషి చేశారని మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు కొనియాడారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనాడు, ఈటివి ఆధ్వర్యాన పలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. వాటిలో భాగంగా 2004లో సీతంపేట మండలంలోని 70 ఆదివాసీ గ్రామాల్లో సారా ఉద్యమం, 2005 తరువాత సమాచార హక్కు చట్టంపై అవగాహన, 2016-18లో సుజాలంచ, సుఫలాం కార్యక్రమం ద్వారా ఇంకుడుగుంతలు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మన్యం సహజ ఎఫ్‌పిఒ సిఇఒ బి.శంకరరావు, మన్యం సహజ ఎఫ్‌పిఒ సమన్వయకర్త ఎన్.అనూప్, సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

పశువులకు టీకాలు

వజ్రపుకొత్తూరు: పాడి అభివృద్ధితోనే రైతు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని సైనూరు మాజీ సర్పంచ్ అట్టాడ రఘు అన్నారు. మండలంలోని పొల్లాడలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 400 పశువులకు జబ్బ వాపు, గొంతువాపు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులను పెంచుకుంటే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. వ్యవసాయంలో నష్టాలను భర్తీ చేసుకోవడానికి పాడిపై రైతులు దృష్టిసారించాలని కోరారు. ఎడి డాక్టర్ మట్ట రవికృష్ణ, డాక్టర్ రాజ్‌కిరణ్, పొల్లాడ ఎహెచ్ బొడ్డేపల్లి లక్ష్మణ్‌లు పశువులకు వైద్య సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాలకృష్ణ, మల్లా కృష్ణ, ఎ.సునీల్, ఎస్.నారాయణ, మార్పు రమణ, బి.మణికంఠ, రామయ్య, ఎం.జీవేశ్వరరావు, గున్న ఈశ్వరరావు, మార్పు రమణమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని వన్ వే కూడలి వద్ద విశ్రాంతి సాయుధ భద్రతా దళం సభ్యుల ఆధ్వర్యాన సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాయక్ పాల్గొని ప్రారంభించారు. ఈ మేరకు కర్బూజా పళ్ల ముక్కలను పాదచారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి సాయుధ భద్రతా దళం సంఘ సభ్యుడు కిల్లి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే అధికారుల సహాయ సహకారాలతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంతి సాయుధ భద్రతా దళం సభ్యులు చీడిపోతు రామారావు, ఎన్ని శ్రీనివాస్, జి.వి.రావు, బి.టి.రావు, కె.మన్మథరావు, కె.తులసీరావు, కె.గణపతిరావు, డి.ఎ.రాజు పాల్గొన్నారు.



కర్బుజా ముక్కలను పంపిణీ చేస్తున్న మాజీ సైనికులు

సంక్షిప్త వార్తలు

విఆర్‌కు పొందూరు ఎస్ఐ

పొందూరు: పొందూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ వై.రవికుమార్‌ను విఆర్‌కు పంపిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడకు ప్రస్తుతం డిపిటిసిలో పనిచేస్తున్న ఎస్ఐ జి.ప్రభాకరరావును తాత్కాలికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఇన్‌ఛార్జి ఎస్ఐగా బాధ్యతలను చేపట్టారు.

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని ఈ నెల 13న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేత్ర వైద్య శిబిరం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి, శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్థానిక ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి : స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని జూనియర్ సివిల్ జడ్జి తేజచక్రవర్తి మల్ల ఒక ప్రకటనలో తెలిపారు. వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్మికులతో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశామని, ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

కూటమి నేతల సంబరాలు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రంలో మంత్రి పదవి దక్కడంపై జిల్లాలోని టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని 31వ వార్డుల్లో సోమవారం వీరంతా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి పెట్టారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు విభూది సూరిబాబు, బిజెపి రాష్ట్ర నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, అంబటి లక్ష్మీరాజ్యం, సవ్వాన వెంకటేశ్వరరావు, గొద్దు భాగ్యలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, కుమార్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుజ్జల సూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న అంబేద్కర్ మందిరం ఆవరణలో పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రభాస్ ఫ్యాన్స్ సభ్యులు ప్రసాద్, నాగేంద్ర, సాయి, సురేష్ పట్నాయక్, రాజు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



లోకేష్‌తో ఎమ్మెల్యేలు అశోక్, గోవిందరావు

ప్రజాశక్తి- కవిటి, ఇచ్ఛాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయాన్ని సాధించడంపై లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా అధికార పార్టీ సాగించిన అక్రమాలపై అలుపెరుగని పోరాటం సాగించిన అశోక్‌ను అభినందించారు. అశోక్ మంత్రి పదవిపై జోరుగా చర్చ జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో లోకేష్ - అశోక్‌ల కలయిక చర్చనీయాంశమైంది. మరోవైపు అశోక్‌కు మంత్రి పదవి ఖాయమని ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటికే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ పదవుల్లో ఉన్న నేతల మధ్య మంత్రివర్గంలో స్థానం సముచిత ఉంటుందని టిడిపి నేతలు భావిస్తున్నారు.

ఎంజిఆర్...

మెళియాపుట్టి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో ఉన్న ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన టిడిపికి రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పలాస : అమరావతిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఎపి జీడిపప్పు తయారీదారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జీడి పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయని, జీడి వ్యాపారులను ఆదుకోవాలని కోరారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించి జీడి వ్యాపారులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. లోకేష్ కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ జీడిపప్పు తయారీదారుల సంఘం (ఎపిసిఎంఎ) అధ్యక్షులు ఫణి రాఘవలు, ఉపాధ్యక్షులు వాసు, కాంతారావు, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరాయులు, కోశాధికారి ప్రతినిధి మల్లేష్ ప్రత్తి ఉన్నారు.



పలాస : సన్మానిస్తున్న సంఘ నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబరు కోడ్లను, రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులపై దాడులు ఆపాలని అరణోదయ జిల్లా కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని పొడ్డపాడులో కమ్యూనిస్టుల పార్టీలపై దాడి, దుష్ప్రచారం, రాజహింసకు వ్యతిరేకంగా సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి వంటకు మద్దతు ధర ప్రకటించాలని, బ్యాంకు రుణాలను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని, విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ నిధులు పెంచి 200 రోజుల పని కల్పించాలన్నారు. జీడి, కొబ్బరిల బోర్డు, కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, ఎపిసిఎల్‌సి జిల్లా నాయకులు వత్తిరి దానేష్, విడిఎసు నాయకులు ఎం.వినోద్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాత్ర ప్రకాష్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, వీరాస్వామి, బైరి కూర్మారావు, దున్న శ్రీనివాస్, వండి వెంకటరావు, దున్న గోవింద్, పోతనపల్లి అరుణ, కొర్రాయి నీలకంఠం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

వైద్యాధికారి ప్రమీలకు సన్మానం



సన్మానిస్తున్న వాకర్సు

శ్రీకాకుళం అర్బన్ : ఆరోగ్య భారత్ సాధనకు సహజ ప్రసవాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సహజ ప్రసవం అనేది బిడ్డకు జన్మనిచ్చే మార్గమని ఏ వన్ ఆస్పత్రి స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ జి.ప్రమీల అన్నారు. నగరంలో శ్రీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో డాక్టర్ మూల వెంకటరావు, ప్రమీల దంపతులను స్టార్ వాకర్సు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ డెలివరీ ద్వారా జన్మించిన శిశువులు బలమైన రోగ నిరోధక వ్యవస్థను అభివృద్ధి చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయని అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బత్తుల దేవీప్రసాద్ కుమార్తె ఇటీవల ఏ వన్ ఆస్పత్రికి డెలివరీకి వెళ్లగా అక్కడ వైద్యులు ప్రమీల నేతృత్వంలో సిబ్బంది సహజ ప్రసవం చేసి తల్లీబిడ్డ ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా ఉండే విధంగా చికిత్స అందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దేవీప్రసాద్ దంపతులు వారిని సన్మానించారు. వాకర్సు ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ జామి నారాయణస్వామి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నాణ్యమైన పంట

ప్రజాశక్తి- కవిటి

నవధాన్యాలతో నాణ్యమైన పంట పండుతుందని వెలుగు ఎపిఎం గోవిందరావు, ప్రకృతి వ్యవసాయం ఇన్‌ఛార్జి తులసయ్య అన్నారు. మండలంలోని గొర్లపాడు యూనిట్‌లో జమేదారుపుట్టుగలో నవధాన్యాలతో నేలతల్లి బాగు అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలు తొలకరిలో జల్లి భూమిలో కలియదున్నితే భూమి సారవంతంగా మారి నాణ్యమైన, పూర్తిపంట వస్తుందని అన్నారు. వీటిని భూమిలో కలియదున్నడం వల్ల యూరియా, డిఎపి వాడకుండా భూసారం పెరుగుతుందని, భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెంది తద్వారా పంటకు కావాల్సిన ప్రధాన పోషకాలు అందించి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది భాగస్వామ్యంతో 175 కిట్లు తయారు చేయించారు. 12 కేజీలు ఉన్న ఈ నవధాన్యాల కిట్లు రూ.750లకే అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విఎఎ పవన్, డిజిటల్ ఇంటర్న్ కృష్ణవేణి, ఐసిఆర్‌పిడి.స్వాతి, రేవతి, విజయలక్ష్మి, లత, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం: నవధాన్యాలు సాగు చేసి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రీజినల్ టెక్నికల్ అధికారి హేమ సుందర్, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రేవతి పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పువలసలో పప్పల భాస్కరరావు అనే రైతు 20 ఎకరాల కొబ్బరి తోటలో రెండేళ్ల నుంచి నవధాన్యాలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 240 కిలోల నవధాన్యాల విత్తనాలను అధికారుల సమక్షంలో సోమవారం విత్తన కిడ్స్‌ను తయారు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవింద్‌రెడ్డి, కంబపు కృష్ణ, గంట్యాడ ఏసుబాబు, గంట్యాడ సూర్యం, గంట్యాడ రమణమ్మ పాల్గొన్నారు.



రణస్థలం : నవధాన్యాలను పరిశీలిస్తున్న అధికారులు